## క్లుప్తంగా

### సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం



అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ వంశీరెడ్డి

**పెదగంట్యాడ:** జీవీఎంసీ 74వ వార్డు దల్లివాని పాలెంలో రూ.15 లక్షలతో చేపట్టనున్న సీసీ రోడ్లు, కాలువల నిర్మాణ పనులను కార్పొరేటర్ తిప్పల వంశీరెడ్డి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వార్డులో చేపట్టిన అభివృద్ధి పనులు జోరుగా సాగుతున్నాయని చెప్పారు. కొత్తగా ప్రారంభించిన రోడ్ల పనులను కూడా చకచకా పూర్తి చేసి వినియోగంలోకి తీసుకువస్తామన్నారు. కార్యక్రమంలో గొందేశి సత్యారావు, దల్లి పైడికొండ, రాజాన వెంకటరావు, మితాన అప్పలరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### పెంటమాంబను దర్శించుకున్న న్యూపోర్టు సీఐ



సీఐ ఎర్రంనాయుడును సత్కరిస్తున్న ఆలయ కమిటీ ప్రతినిధులు

**పెదగంట్యాడ:** నెల్లిముక్కు పంచాయతీ 14 గ్రామాల ప్రజల ఆరాధ్యదైవం పెంటమాంబ అమ్మవారిని న్యూపోర్టు పోలీస్‌స్టేషన్ సీఐ ఎర్రంనాయుడు సోమవారం దర్శించుకున్నారు. అమ్మవారికి విశేష పూజలు చేశారు. అనంతరం ఆయనను ఆలయ కమిటీ ప్రతినిధులు సత్కరించారు. కార్యక్రమంలో గొందేశి మహేశ్వరరెడ్డి, గొందేశి సత్యారావు, పులి రాజారెడ్డి, పులి వెంకట రమణారెడ్డి, గొందేశి అప్పలరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### నూతన డైరెక్టర్‌కు ఇంటక్ అభినందనలు

**ఉక్కునగరం:** స్టీల్‌ప్లాంట్ డైరెక్టర్ (కమర్షియల్)గా ఎంపికైన జీ.వి.ఎస్. ప్రసాద్‌ను స్టీల్ ఇంటక్ నాయకులు అభినందించారు. నాయకులు సోమవారం ఆయన కార్యాలయంలో కలిసి శాలువా కప్పి, బొకే అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ చార్జిమన్‌గా ప్లాంట్‌లో చేరి డైరెక్టర్ స్థాయికి ఎదగడం అభినందనీయమన్నారు. ఆయన నేతృత్వంలో ప్లాంట్ మార్కెటింగ్ మరింత అభివృద్ధి చెందగలదన్న ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నీరుకొండ రామచంద్రరావు, బీఎస్ రాజు, కారు రమణ, ప్రభాకరరెడ్డి, అవతారం, ఎస్.ఎ. నాయుడు తదితరులు పాల్గొన్నారు.

### ఘనంగా గౌరీ పరమేశ్వరుల ఉత్సవాలు



గౌరీ పరమేశ్వరుల ఉత్సవ విగ్రహాలను ఊరేగిస్తున్న నాయకులు

**అక్కిరెడ్డిపాలెం:** జీవీఎంసీ 69వ వార్డు హరిజన జగ్గయ్యపాలెం కాలనీ గౌరీ సేవా సంఘం ఆధ్వర్యంలో గౌరీ పరమేశ్వరుల మహోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా కాలనీ వాసులు, గ్రామ నాయకులు గౌరీ పరమేశ్వరుల ఉత్సవ విగ్రహాలను ఊరేగింపుగా తీసుకువెళ్లి, రామాలయం వద్ద ప్రతిష్ఠించారు. 11 రోజుల పాటు ఉత్సవాలను ఘనంగా నిర్వహించనున్నట్లు కాలనీ ప్రతినిధులు తెలిపారు.

### 67వ వార్డులో టీడీపీ ప్రచారం

**గాజువాక:** భవిష్యత్తు గ్యారంటీ.. బాబు ష్యూరిటీపై టీడీపీ నాయకులు 67వ వార్డు గణేష్‌నగర్‌లో సోమవారం ప్రచారం చేశారు. కార్యక్రమాన్ని మాజీ ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు ప్రారంభించారు. టీడీపీ, జనసేన మ్యానిఫెస్టోను వివరిస్తూ ప్రచారం కొనసాగించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ పల్లా శ్రీనివాసరావు, నాయకులు పాల్గొన్నారు.





అక్కిరెడ్డిపాలెంలో గ్రీన్ బెల్టును ఆక్రమించి నిర్వహిస్తున్న వ్యాపారాలు



68వ వార్డులో గ్రీన్ బెల్టును ఆక్రమించి నిర్వహిస్తున్న వ్యాపారాలు

# ఆక్రమణల్లో గ్రీన్‌బెల్ట్

- సర్వీస్ రోడ్లకు విస్తరిస్తున్న వ్యాపారాలు
- వాహనచోదకుల అవస్థలు
- పట్టించుకోని అధికారులు

**అక్కిరెడ్డిపాలెం:** వాహన కాలుష్య నివారణ చర్యల్లో భాగంగా జాతీయ రహదారికి ఇరువైపులా ఏర్పాటు చేసిన గ్రీన్‌బెల్ట్ కనుమరుగవుతోంది. వ్యాపారులు గ్రీన్‌బెల్టును ఆక్రమించి, సర్వీసు రోడ్డుపైకి తమ వ్యాపారాలను విస్తరిస్తున్నారు. దీంతో పచ్చదనంతో పరిఢవిల్లాల్సిన గ్రీన్ బెల్టులు వ్యాపార సముదాయాలుగా మారిపోతున్నాయి. సర్వీసు రోడ్డుపై ప్రయాణించే పలువురు వాహనచోదకులు ఇబ్బంది పడుతున్నారు. జీవీఎంసీ 68, 69 వార్డుల పరిధిలో ఈ పరిస్థితి నెలకొంది. గ్రీన్ బెల్టుల ఆక్రమణలను అరికట్టాల్సిన ఎన్‌హెచ్–16 అధికారులు, సిబ్బంది ఆ దిశగా చర్యలు చేపట్టడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు.

జీవీఎంసీ 68వ వార్డు పరిధి అక్కిరెడ్డిపాలెం సర్వీసు రోడ్డు పక్కనున్న గ్రీన్ బెల్టు పూర్తిగా వ్యాపారుల హస్తగతం అయిందని పలువురు ఆరోపిస్తున్నారు. ఫెన్సింగ్ ఏర్పాటు చేసి, పచ్చని మొక్కలతో కళకళలాడాల్సిన ఈ ప్రాంతం కాంక్రీట్ జంగిల్‌లా మారింది. వేలల్లో అద్దె కడుతున్న షాపుల ఎదురుగా ఉన్న గ్రీన్ బెల్ట్ ప్రాంతంలో ఆక్రమణదారులు దుకాణాలు ఏర్పాటు చేయడంతో, తమ షాపులకు వచ్చే కొనుగోలుదారులు వీరిని దాటుకుని తమ షాపులకు రావడానికి ఇబ్బంది పడుతున్నారని గగ్గోలు పెడుతున్నారు. సాయంత్రం అయితే చాలు గ్రీన్ బెల్టు ప్రాంతంలో నిర్వహించే ఫాస్ట్ ఫుడ్స్ స్టాల్స్‌కు వచ్చేవారు తమ వాహనాలు రోడ్డుపైనే పార్క్ చేస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. సర్వీసు రోడ్డుపై ప్రయాణించే వాహనచోదకులు పార్క్ చేసి ఉన్న వాహనాలతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు.

అక్కిరెడ్డిపాలెం, నాతయ్యపాలెం ప్రాంతాల్లో నిర్వహిస్తున్న పలు హోటల్స్ నిర్వాహకులు గ్రీన్ బెల్టులను ఆక్రమించి నిర్మాణాలు చేపట్టి, యథేచ్ఛగా వ్యాపారాలు సాగిస్తున్నారు. ఈ హోటల్స్‌కు వచ్చే కొనుగోలుదారులు తమ వాహనాలను రోడ్డుపైనే పార్క్ చేయడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. నాతయ్యపాలెంలో గ్రీన్ బెల్టు స్థలాలు పూర్తిగా హరించుకుపోయాయని పలువురు ఆరోపిస్తున్నారు. గ్రీన్ బెల్టు స్థలాల్లో ఏకంగా పర్మినెంట్ నిర్మాణాలు చేపట్టారని అంటున్నారు. ట్రాఫిక్ పోలీసులు కూడా పట్టించుకోకపోవడంపై విస్మయం వ్యక్తం చేస్తున్నారు.



69వ వార్డు నాతయ్యపాలెంలో కనిపించని గ్రీన్ బెల్టు

### పచ్చదనం పెంపొందించాలి

అక్కిరెడ్డిపాలెం, నాతయ్యపాలెం సర్వీసు రోడ్డును ఆనుకొని ఉన్న గ్రీన్ బెల్ట్ స్థలాలను ఎన్‌హెచ్–16 అధికారులు స్వాధీనం చేసుకోవాలి. వాటిలో పచ్చదనాన్ని పెంపొందించేలా చర్యలు చేపట్టాలి. గ్రీన్ బెల్టు స్థలాలను ఆక్రమించి వ్యాపారాలు సాగిస్తున్న వారు చాలా మందికి ఇబ్బంది కలిగిస్తున్నారు. అధికారులు చర్యలు తీసుకోవాలి.

– లక్ష్మణరావు, అక్కిరెడ్డిపాలెం

### రోడ్డుపైనే వాహనాల పార్కింగ్

అక్కిరెడ్డిపాలెం సర్వీసు రోడ్డును ఆనుకొని ఉన్న ఫాస్ట్‌ఫుడ్స్ వ్యాపారులు సర్వీసు రోడ్డుపైనే వ్యాపారాలు నిర్వహించడంతో స్టాల్స్‌కు వచ్చే కస్టమర్లు తమ వాహనాలను రోడ్డుపైనే పార్క్ చేస్తున్నారు. దీంతో సర్వీసు రోడ్డుపై ప్రయాణించే వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. వీటిపై అధికారులు దృష్టి సారించాలి

– వెంకట్రావు, వాహనచోదకుడు

# ఘనంగా దీపావళి వేడుకలు



చిచ్చుబుడ్డిని వెలిగిస్తున్న మంత్రి అమర్‌నాథ్

**గాజువాక:** దీపావళి వేడుకలు గాజువాకలో ఆదివారం ఘనంగా జరిగాయి. ఉదయం నుంచే చిన్నారులు సందడి చేశారు. చిన్నా, పెద్దా తేడా లేకుండా టపాసులు కాల్చుతూ ఆనందంగా గడిపారు. మహిళలు వివిధ రూపాల్లో దీపాలను అలంకరించి పూజలు చేశారు. రాత్రి 11 గంటల వరకు కాలనీల్లో సందడి చోటుచేసుకుంది. గతేడాదితో పోల్చితే ఇప్పుడు టపాసుల శబ్దం బాగా తగ్గిందని పలువురు హర్షం వ్యక్తం చేశారు. ఈసారి దీపాలకు ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వడం కనిపించింది. పెద్ద పెద్ద శబ్దాలు చేసే బాణసంచా కాకుండా చిచ్చుబుడ్లు, కాకర పువ్వొత్తులు, మతాబులు, రంగు రంగుల అగ్గిపుల్లలు, భూచక్రాలు, విష్ణు చక్రాలు వంటి టపాసులతో దీపావళి వేడుకలను జరుపుకొన్నారు.

**అక్కిరెడ్డిపాలెం:** దీపావళిని రాష్ట్ర పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ 68వ వార్డు మిందిలోని ఆయన నివాసంలో సందడిగా జరుపుకొన్నారు. కుటుంబ సభ్యులతో కలిసి బాణసంచాను కాల్చి, ఆనందంగా గడిపారు. 69వ వార్డు నాతయ్యపాలెంలో వైఎస్సార్ సీపీ వార్డు అధ్యక్షుడు, ఏపీ సివిల్ సప్లై కార్పొరేషన్ డైరెక్టర్ బోగాది సన్యాసిరావు కుటుంబ సభ్యులతో దీపావళిని ఘనంగా జరుపుకొన్నారు.

**అగనంపూడి:** దీపావళిని పర్యావరణహితంగా జరుపుకొన్నారు. పర్యావరణవేత్తలు, సామాజికవేత్తలు మందుగుండు సామగ్రి వాడకం వల్ల కలిగే దుష్ఫలితాలపై కొన్నేళ్లుగా విస్తృత ప్రచారం చేస్తుండటంతో ఈ ఏడాది మందుగుండు సామగ్రికి అంతగా ప్రాధాన్యతనివ్వలేదు. దీపాలు వెలిగించి, కొద్దిపాటి సామగ్రితో దీపావళి సంబరం నిర్వహించారు.

# భక్తిశ్రద్ధలతో నృసింహ హోమం



నృసింహ హోమం నిర్వహిస్తున్న అర్చకులు



ప్రధాన కలశంతో తిరువీధి నిర్వహిస్తున్న ప్రధానార్చకుడు రమణాచార్యులు

**సింహాచలం:** స్వాతి నక్షత్రాన్ని పురస్కరించుకుని సింహగిరిపై ఆదివారం నృసింహ హోమం ఘనంగా జరిగింది. లోక కల్యాణార్థం వరాహ లక్ష్మీనృసింహస్వామి జన్మ నక్షత్రమైన ప్రతీ స్వాతి నక్షత్రం రోజు సింహగిరిపై నృసింహ హోమం నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఉదయం 7 గంటల నుంచి ఆలయ ప్రాంగణంలోని కల్యాణ మండపంలో హోమం నిర్వహించారు. ఆన్‌లైన్ ద్వారా తొలిసారి టికెట్లు అందుబాటులో ఉంచడంతో 50 మంది దంపతులు హోమంలో పాల్గొని తరించారు. తొలుత చక్రపెరుమాళ్లను ఆలయంలోంచి ఊరేగింపుగా కల్యాణ మండపానికి తీసుకొచ్చి హోమగుండం వద్ద అధిష్ఠింపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కలశారాధన, అగ్నికార్యం చేశారు. అనంతరం నృసింహ హోమాన్ని విశేషంగా నిర్వహించారు. యాగంలో పాల్గొన్న ఉభయదాతలతో స్వామివారి అష్టోత్తరనామావళి పఠింపజేశారు. అనంతరం పూర్ణాహుతి, కుంభప్రోక్షణ చేశారు. హోమంలో ఉంచిన ప్రధాన కలశాన్ని ప్రధానార్చకుడు ఇరగవరపు రమణాచార్యులు శిరస్సుపై పెట్టుకుని తిరువీధిగా ఆలయంలోకి తీసుకెళ్లి స్వామివారి మూలవిరాట్‌కు సమర్పించారు. స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, ప్రధానార్చకులు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, ఇరగవరపు రమణాచార్యులు, అర్చకులు కార్యక్రమాన్ని నిర్వహించారు. దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి, ట్రస్ట్‌బోర్డు సభ్యులు సంపంగి శ్రీనివాసరావు, వారణాసి దినేష్ రాజ్, పిళ్లా కృష్ణమూర్తి పాత్రుడు పాల్గొన్నారు.

**ఘనంగా తిరునక్షత్రం పూజలు**

**సింహాచలం:** శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో ఐదు రోజుల పాటు జరగనున్న మనవాళ్ మహా మునులు తిరునక్షత్రం పూజలను ఆదివారం పాంచరాత్ర ఆగమశాస్త్రాన్ని అనుసరించి ఆలయ వైదికులు శాస్త్రోక్తంగా ప్రారంభించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను ఆలయ ఆస్థాన మండపంలో వేదికపై అధిష్ఠింపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం నిర్వహించారు. అనంతరం దివ్యప్రబంధ పారాయణం నిర్వహించి విశేషంగా హారతులు అందజేశారు. స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, పారాయణదారులు అధ్యాపకులు కార్యక్రమాన్ని నిర్వహించారు.

## నేడు గరికిపాటికి సాహిత్య కళాభారతి పురస్కారం

**మద్దిలపాలెం :** విశాఖ మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో పద్మశ్రీ పురస్కార గ్రహీత డాక్టర్ గరికిపాటి నరసింహారావును సాహిత్య కళాభారతి పురస్కారంతో సత్కరించనున్నామని వీఎండీఏ అధ్యక్ష, కార్యదర్శులు ఎం.ఎస్.రాజు, డాక్టర్ గుమ్ములూరి రాంబాబు తెలిపారు. పురస్కారంతో పాటు, నాలుగు రోజుల పాటు నిర్వహించే ఆకాశదీపం – కాశీఖండం ప్రవచన కార్యక్రమాలకు సంబంధించిన వివరాలను సోమవారం మీడియాకు వివరించారు. ప్రభుత్వ విశ్రాంత ప్రధాన కార్యదర్శి ఎల్వీ సుబ్రహ్మణ్యం చేతుల మీదుగా మంగళవారం డాక్టర్ గరికిపాటి నరసింహారావును సాహిత్య కళాభారతి పురస్కారంతో సత్కరించనున్నారని తెలిపారు. బుధవారం నుంచి 17వ తేదీ వరకు రోజూ సాయంత్రం 5.30 గంటల నుంచి ఆకాశదీపం– కాశీఖండంపై డాక్టర్ గరికిపాటి నరసింహారావు ప్రవచించనున్నారని పేర్కొన్నారు. వీఎండీఏ ప్రతినిధి పైడా క్రిష్ణప్రసాద్ పాల్గొన్నారు.

## ఫ్యాన్సీ డ్రెస్ పోటీలకు ఆహ్వానం

**మర్రిపాలెం:** జవహర్‌లాల్ నెహ్రూ జయంతిని పురస్కరించుకుని ఈ నెల 14న ఫ్యాన్సీ డ్రెస్ పోటీలు నిర్వహిస్తున్నట్లు మహిళా వాకర్స్ క్లబ్ (మాధవధార) అధ్యక్షురాలు ఎం.శేషమణి ప్రకటనలో తెలిపారు. మాధవధారలోని జీవీఎంసీ పాఠశాలలో ఈ నెల 14న సాయంత్రం 4 గంటలకు పోటీలు జరుగుతాయన్నారు. నర్సరీ, ఎల్‌కేజీ, యూకేజీ చదువుతున్న చిన్నారులు స్వాతంత్ర్య సమరయోధులు, సూపర్‌హీరోల వేషధారణలో పాల్గొనాల్సి ఉంటుందని చెప్పారు. అనంతరం మాధవధార 48ఏ బస్టాప్ రోడ్డులోని ఈస్ట్ పార్కులో జరిగే వేడుకల్లో విజేతలకు బహుమతులు అందజేస్తామని తెలిపారు. ఆసక్తి గల తల్లిదండ్రులు తమ పిల్లల పేర్లను 94928 73277 నంబర్‌కు ఫోన్ చేసి నమోదు చేసుకోవాలని కోరారు.

## డీసీసీబీ చైర్మన్ ఆకస్మిక తనిఖీ



బ్యాంకు సిబ్బందితో మాట్లాడుతున్న గురువులు

**గాజువాక:** జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ (డీసీసీబీ) చైర్మన్ కోలా గురువులు గాజువాకలోని ఆ బ్యాంక్ బ్రాంచ్‌ను సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. బ్యాంక్ సీఈవో వర్మతో కలిసి బ్యాంక్‌కు వచ్చిన ఆయన ఇక్కడ జరుగుతున్న కార్యకలాపాలపై సిబ్బంది నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. వినియోగదారులకు అందుతున్న సేవలను పరిశీలించారు. మెరుగైన సేవలను అందించి, బ్యాంకు అభివృద్ధికి కృషి చేయాలని సిబ్బందికి సూచించారు.

### నేడు స్వర్ణ పుష్పార్చన

**దాబాగార్డెన్స్:** బురుజుపేట కనకమహాలక్ష్మి అమ్మవారికి 108 స్వర్ణ పుష్పాలతో మంగళవారం అష్టదళ పద్మారాధన నిర్వహించనున్నారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు జరిగే పూజలో పాల్గొనదలచే భక్తులు రూ.1,116 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలి.

# స్క్రాప్ దుకాణంలో మంటలు

- తారాజువ్వలు ఎగిరి పడడంతో ప్రమాదం
- బెంబేలెత్తిన స్థానికులు
- అదుపు చేసిన అగ్నిమాపక శకటాలు



కాలిబూడిదైన ప్లాస్టిక్ సామగ్రి, కవర్లు, వ్యర్థాలు



ఎగసిపడుతున్న మంటలు

**అగనంపూడి:** దీపావళి సందర్భంగా తారాజువ్వలు ఎగిరిపడడంతో అగనంపూడిలోని ఒక స్క్రాప్ దుకాణంలో మంటలు చెలరేగాయి. అంతటా దట్టమైన పొగ కమ్ముకోవడంతో స్థానికులు భయాందోళన చెందారు. వివరాలివి.. అగనంపూడి నిర్వాసితకాలనీ బొర్రమ్మకాలనీ, తలారివానిపాలెం మధ్యలో ఆవాసాల మధ్య సత్తిబాబు అనే వ్యక్తి స్క్రాప్ దుకాణం నడుపుతున్నారు. ఇక్కడ స్క్రాప్‌తో పాటు ప్లాస్టిక్ వ్యర్థాలు అధికంగా ఉన్నాయి. ఆదివారం రాత్రి ఏడున్నర గంటల సమయంలో ఓ ఇంట్లో తారాజువ్వలు వెలిగించగా అవి స్క్రాప్ దుకాణంలో పడడంతో ప్లాస్టిక్ కవర్లు, బాటిళ్లు, ఇతర సామగ్రికి నిప్పంటుకుని మంటలు ఎగసిపడ్డాయి. సమీప ప్రాంతం అంతా దట్టమైన పొగతో నిండిపోయింది. కొద్దిసేపటికి ప్లాస్టిక్ వ్యర్థాలు కాలిపోయి, వాసనతో పొగతో ఊపిరాడక స్థానికులు ఉక్కిరిబిక్కిరి అయ్యారు. దుకాణానికి సమీపంలో నివాసాలు ఉండడంతో స్థానికులు ఆందోళన చెందారు. పెదగంట్యాడ అగ్నిమాపక కేంద్రానికి చెందిన ఫైరింజన్లు వచ్చి మంటలను అదుపు చేయడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

**ఆవాసాల మధ్య దుకాణం తొలగించాలి**

అగనంపూడిలో ఆవాసాల మధ్య, సమీపంలో సుమారు 8 స్క్రాప్ దుకాణాలు నడుస్తున్నాయి. రెండు మూడు చోట్ల భారీ స్థాయిలో ప్లాస్టిక్ వ్యర్థాలు డంప్ చేస్తున్నారు. పొరపాటున ఇలాంటి సంఘటనలు పునరావృతం అయితే ఏంటని స్థానికులు భయాందోళన చెందుతున్నారు. అగనంపూడికి చెందిన ప్రజా సంఘాల ప్రతినిధులు అక్కడికి చేరుకుని, వెంటనే దుకాణం తొలగించాలని యజమానిని డిమాండ్ చేశారు. అధికారులు స్పందించి, ఆవాసాల మధ్య దుకాణాలు తొలగించాలని కోరారు.

## బాసుదేవ్ ఆచార్య మృతి తీరని లోటు

**అక్కిరెడ్డిపాలెం:** బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి నిరంతరం కృషి చేసిన బాసుదేవ్ ఆచార్య మృతి తీరని లోటు అని భెల్ సిటూ ప్రధాన కార్యదర్శి జి.టి.పి.ప్రకాష్ అన్నారు. సీపీఎం మాజీ ఫ్లోర్ లీడర్, పార్లమెంటు సభ్యుడు బాసుదేవ్ ఆచార్య మృతికి భెల్ సిటూ నాయకులు సంతాపం తెలిపారు. ఈ సందర్భంగా సంస్థలో నిర్వహించిన సంతాప సభలో ఆయన మాట్లాడుతూ బీహెచ్‌పీవీని భెల్‌లో విలీనం చేసేందుకు మొట్టమొదటి సారి ప్రతిపాదించిన వ్యక్తి బాసుదేవ్ అని గుర్తు చేశారు. బీహెచ్‌పీవీ సమస్యలపై పార్లమెంట్‌లో పలుమార్లు తన వాణిని వినిపించారన్నారు. ఆయన మరణం బాధాకరమని పేర్కొన్నారు.కార్యక్రమంలో సిటూ నాయకులు ఎస్.జగన్నాథరావు, కె.విజయ్‌కుమార్, ఎస్.అప్పారావు, పి.కనకారావు, జి.అచ్చంనాయుడు, పి.శివరాం తదితరులు పాల్గొన్నారు.

### రాజరాజేశ్వరి క్షేత్రంలో ప్రత్యేక పూజలు

**సబ్బవరం:** ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రం దేవీపురంలోని సహస్రాక్షి రాజరాజేశ్వరీదేవి ఆలయంలో ఆది, సోమవారాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. హోమశాలలో శ్రీమహా గణపతి, మహా మృత్యుంజయ సహిత మహాలక్ష్మి హోమం చేశారు. పంచామృతాభిషేకం,నూతన వస్త్ర, ఆభరణ అలంకరణ జరిగాయి. గురుమాత అన్నపూర్ణమ్మ దీపావళి విశిష్టతపై భక్తులకు సందేశమిచ్చారు.

## 'ఉద్యమంతో కేంద్ర ప్రభుత్వానికి గుణపాఠం నేర్పుతాం'



1005వ రోజు ఉక్కు దీక్ష శిబిరంలో పాల్గొన్న పోరాట కమిటీ నాయకులు

**కూర్మన్నపాలెం:** కార్మికుల నిరవధిక ఉద్యమంతో కేంద్ర ప్రభుత్వానికి బుద్ధి చెపుతామని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు అన్నారు. భవిష్యత్తులో ప్రభుత్వరంగ సంస్థల జోలికి వెళ్లకుండా ఉండేలా గుణపాఠం నేర్పుతామన్నారు. విశాఖ ఉక్కు కర్మాగారం ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద నిర్వహిస్తున్న నిరాహారదీక్షలు సోమవారం నాటికి 1005వ రోజుకు చేరుకున్నాయి. దీక్ష శిబిరంలో సంస్థకు చెందిన సీవో మరియు సీపీపీ విభాగ కార్మికులు పాల్గొని, నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటువారికి అప్పగించాలన్న లక్ష్యానికి ఎదురు తిరిగిన కార్మిక వర్గానికి దెబ్బ కొట్టాలని కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం చూస్తోందన్నారు. ఇందుకు అనుగుణంగా దొడ్డిదారిన స్టీల్‌ప్లాంట్‌ను నిర్వీర్యం చేయడానికి ఉక్కు యాజమాన్యంతో కలిసి విద్రోహ చర్యలు చేపట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సంస్థలో ప్రధాన విభాగాలను పాక్షికంగా నిలిపివేయడమే ఇందుకు నిదర్శనమన్నారు. ఉక్కు నిర్వాసితులు ఇప్పటికీ శాశ్వత ఉపాధి లేక ఇబ్బంది పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉక్కు ఉద్యమ సెగ దేశవ్యాప్తంగా వెళ్లిందన్నారు. స్టీల్‌ప్లాంట్ రక్షణకు సీపీఎం ఆధ్వర్యంలో నవంబర్ 15వ తేదీన విజయవాడలో నిర్వహిస్తున్న ప్రజారక్షణ భేరి కార్యక్రమానికి మంగళవారం ఉదయం 7 గంటలకు దీక్షా శిబిరం నుంచి సుమారు 200 మంది కార్మికులు బైక్ ర్యాలీ ద్వారా విజయ వాడ చేరుకుంటారని తెలిపారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

## వాలీబాల్ పోటీల విజేతలకు బహుమతులు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న నర్సింగరావు

**పెదగంట్యాడ:** బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఏఎస్ఆర్ హెల్పింగ్ హ్యాండ్స్ ఆధ్వర్యంలో స్థానిక బీసీ రోడ్డులోని మార్వెల్ స్కూల్ మైదానంలో విద్యార్థులకు సోమవారం వాలీబాల్ పోటీలు నిర్వహించారు. విజేతలకు బీజేపీ గాజువాక నియోజకవర్గ కన్వీనర్ కరణంరెడ్డి నర్సింగరావు చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో క్రీడాస్ఫూర్తిని నింపేందుకు ఇటువంటి పోటీలు దోహదం చేస్తాయన్నారు. కార్యక్రమంలో ఏఎస్ఆర్, రవికుమార్, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

**కిక్‌బాక్సింగ్ విజేతలకు పతకాలు**

**గాజువాక:** కిక్ బాక్సింగ్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉత్తరాంధ్ర స్థాయి కిక్‌బాక్సింగ్ పోటీల్లో గాజువాకకు చెందిన పలువురు ప్రతిభ ప్రదర్శించారు. వారికి గాజువాకలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కిక్ బాక్సింగ్ సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షుడు కరణంరెడ్డి నర్సింగరావు సోమవారం సర్టిఫికెట్లు, పతకాలు అందజేశారు. విజేతలు వచ్చేనెలలో రాజమండ్రిలో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి పోటీలకు హాజరుకానున్నారని తెలిపారు. కోచ్‌లు శరత్, హరీష్, ప్రదీప్ పాల్గొన్నారు.

## భద్రతకు అధిక ప్రాధాన్యం



కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు, కార్మిక సంఘాల నాయకులు

**ఉక్కునగరం:** స్టీల్‌ప్లాంట్ కోక్‌ఓవెన్స్ విభాగంలో శూన్య ప్రమాద లక్ష్యంగా ఉద్యోగులు ముందుకు సాగాలని స్టీల్‌ప్లాంట్ భద్రతా విభాగాధిపతి డి.రాంప్రసాద్ కోరారు. కోక్‌ఓవెన్స్ విభాగం సేఫ్టీ కమిటీ ఆధ్వర్యంలో విభాగం ఏరియా షాపు ఆఫీసు వద్ద భద్రతా పతకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఉక్కు యాజమాన్యం భద్రతకు అధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ఇందులో భాగంగా నిత్యం భద్రతా చర్యలను పరిశీలిస్తూ ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటోందన్నారు. కోక్‌ఓవెన్స్ విభాగాధిపతి ఎం.వి.ఎస్. దుర్గాప్రసాద్ మాట్లాడుతూ ఉద్యోగులందరూ తమ విధి నిర్వహణలో భద్రతా పనిముట్లను తప్పనిసరిగా వినియోగించాలన్నారు. ఈ సందర్భంగా భద్రతా ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో వివిధ కార్మిక సంఘాల నాయకులు కొమ్ము ప్రసాదరావు, ఎస్.జె.ప్రసాద్, టి.వి.కె.రాజు, విభాగం జీఎంలు ఎస్.కె.రౌత్, బి.కోటేశ్వరరావు, శర్మ, డీజీఎంలు మురళీకృష్ణ, సీహెచ్. శ్రీనివాస్, బి.ఎస్.ఆర్.నాయక్, బాపూజీ తదితరులు పాల్గొన్నారు.

# భైరవకోనకు పోటెత్తిన భక్తులు



భైరవస్వామికి అభిషేకం చేస్తున్న అర్చకుడు

**సింహాచలం:** అమవాస్య పురస్కరించుకుని సోమవారం భైరవవాకలోని భైరవస్వామి దర్శనానికి భక్తులు పోటెత్తారు. ఆలయనికి వెళ్లే రెండు కిలోమీటర్ల అటవీమార్గం భక్తులతో కిక్కిరిసింది. తెల్లవారుజాము రెండు గంటల నుంచి నగరంలోని పలు ప్రాంతాలకు చెందిన భక్తులు ఆలయానికి చేరుకున్నారు. స్వామికి అభిషేకాలు నిర్వహించారు. విభూదితో అర్చన చేశారు.అమృత కలశాలు సమర్పించి మొక్కు తీర్చుకున్నారు. ఆలయ ప్రాంగణమంతా దీపాలతో నిండిపోయింది.